సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం । 7 । జూలై । 2024



రైలులో సమస్యలకు.. యాప్‌తో చెక్

రైలులో ప్రయాణించే వారికి సమస్య తలెత్తినపుడు ఫిర్యాదు చేసేందుకు వీలుగా రైల్వేశాఖ రైల్ మదద్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. -8లో



మరణంలోనూ వీడని స్నేహం

మరణంలోనూ వారి స్నేహం వీడలేదు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కడపకు చెందిన నలుగురు మృతిచెందారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.6/26.4

జిల్లాలో శనివారం 26.4 – 36.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

ఉప్పొంగిన అభిమానం..

ఊరూరా నీరాజనం

- వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం
- రిమ్స్‌లో పోటెత్తిన అభిమానులు
- అభిమాన నేతను చూసేందుకు పోటీపడిన చిరుద్యోగులు
- కడప నుంచి పులివెందుల చేరుకునేందుకు 4 గంటల సమయం
- గ్రామగ్రామాన భారీగా తరలివచ్చిన జనం
- పులివెందుల కార్యాలయంలో ప్రజలతో మమేకం



కడప- పులివెందుల మార్గంలోని ఓ గ్రామం వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కరచాలనం చేసేందుకు పోటీపడుతున్న అభిమానులు

ప్రజలకు వైఎస్ జగన్ అభివాదం

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లాలో శనివారం పర్యటించిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అడుగడుగునా అపూర్వ స్వాగతం లభించింది. తమ అభిమాన నేతను చూసేందుకు ప్రజానీకం పోటెత్తారు. కడపలోని రిమ్స్ ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయింది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిన నాయకున్ని చూసేందుకు చిరుద్యోగులు పోటీపడ్డారు. దీంతో రిమ్స్‌లో ఓ దశలో జనం మధ్య తోపులాట జరిగింది. ఆ తర్వాత పులివెందుల వరకూ గ్రామ గ్రామాన ప్రజలు రోడ్డుపైకి చేరుకొని ప్రియతమ నేతను చూసేందుకు ఆరాటపడ్డారు. కడప నుంచి పులివెందుల చేరుకునేందుకు 4 గంటల సమయం పట్టింది. మరోవైపు పులివెందులలో ఉదయం నుంచి అభిమానులు వైఎస్ జగన్ కోసం నిరీక్షించారు.

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రోజుల పర్యటన నిమిత్తం శనివారం మధ్యాహ్నం 12.50 గంటలకు కడప ఎయిర్‌పోర్టు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆయన రిమ్స్ చేరుకుని ఇటీవల టీడీపీ వర్గీయుల హత్యాయత్నం సంఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న వేంపల్లె అజయ్ కుమార్‌రెడ్డిని పరామర్శించారు. యువకుడిపై హత్యాయత్నం నేపథ్యాన్ని తెలుసుకొని చలించిపోయారు. ఎన్నికల తర్వాత దాడి చేశారని తెలుసుకున్న ఆయన అక్కడి నుంచి సీఎం చంద్రబాబుకు హెచ్చరికలు చేశారు. పులివెందులలో ఎన్నికల్లో ఓటు వేయలేదని దాడులకు పాల్పడిన ఇలాంటి సాంప్రదాయం ఎప్పుడూ లేదన్నారు. ఇప్పటికైనా దారుణాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని సూచించారు. లేదంటే మీరు వేస్తున్న విషబీజం భవిష్యత్తులో వెంటాడి మీ కార్యకర్తలనే కాటేస్తుందనే వాస్తవాన్ని గ్రహించాలని సూచించారు.

కడప నుంచి పులివెందుల వరకూ...

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎయిర్‌పోర్టు చేరుకోగానే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, ఎస్‌బి అహమ్మద్‌బాషా, డాక్టర్ సోహెల్ తదితరులు ఘన స్వాగతం పలికారు. లాంజ్ నుంచి బయటికి వచ్చే లోపు యువత పెద్ద ఎత్తున కేరింతలు కొడుతూ సెల్ఫీలు దిగారు. అక్కడి నుంచి రిమ్స్‌కు పయనం కాగా, దారి వెంబడి మోటార్ బైకుల్లో అనుసరించారు. అప్పటికే రిమ్స్‌లో భారీగా అభిమానులు ఉండిపోయారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త అజయ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించి వచ్చేలోపు రిమ్స్ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు మహిళలు పోటీపడ్డారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజానీకం అక్కడికే చేరుకోవడం, మరోవైపు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దక్కించుకున్న చిరుద్యోగులు రావడంతో ఆ ప్రాంగణంలో తోపులాట ఏర్పడింది. మరోవైపు యువత పోటాపోటీగా సెల్ఫీలు తీసుకునే యత్నాలు చేశారు.

దారి వెంబడి ఎదురుచూసిన పల్లె ప్రజానీకం...

కడప రిమ్స్ నుంచి బయలు దేరిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకను తెలుసుకున్న పల్లె జనం దారి వెంబడి ఆయన కోసం ఎదురుచూస్తూ ఉండిపోయారు. ఎర్రమాచుపల్లె నుంచి ప్రారంభమై కొప్పర్తి, మిట్టమీదపల్లె, వెల్లటూరు, పెండ్లిమర్రి, గుర్రాలచింతపల్లె, బాలయ్యగారిపల్లె, నల్లయ్యగారిపల్లె, నందిమండలం, తంగేడుపల్లె, వేంపల్లె, నందిపల్లె, తాళ్లపల్లె, దుగ్గన్నగారిపల్లె, వి కొత్తపల్లె, వేముల, వేల్పుల, బెస్తవారిపల్లె ఇలా ప్రతి గ్రామం వద్ద కాన్వాయ్‌ని నిలపాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పటికే గంటల తరబడి తన కోసం నిరీక్షిస్తున్న ప్రజల అభిమానాన్ని చూసి సంతోషంగా స్పందించిన వైఎస్ జగన్ గ్రామగ్రామాన వారితో ఆప్యాయంగా మాట్లాడుతూ.. వారి అభిమానం మధ్య గ్రామాలు దాటుకోవాల్సి వచ్చింది. దీంతో కడపలో మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరిన ఆయన సాయంత్రం 6 గంటలకు పులివెందుల కార్యాలయానికి చేరుకున్నారు.

పులివెందులలో కార్యకర్తలతో మమేకం..

పులివెందులలోని భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, ప్రజలు, నేతలు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వారితో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మమేకమయ్యారు. మధ్యాహ్నానికి చేరుకుంటారని భావించినా ముందే వచ్చిన పులివెందుల వాసులకు సాయంత్రం 6 గంటల వరకూ నిరీక్షణ తప్పలేదు. ఆపై ఓపిగ్గా వారి వారి విన్నపాలు వింటూ అవసరమైన చర్యలకు సిఫార్సులు చేయసాగారు. మరోవైపు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవాలని, ఆయనకు అండగా నిలవాలని, మేమంతా మీవెంటే ఉన్నామని చెప్పాలనే ఆత్రుత పెద్ద ఎత్తున ప్రజానీకంలో కన్పించింది. అభిమానులతో రాజకీయ అంశాలతో పాటు, వ్యక్తిగత యోగక్షేమాలు తెలుసుకున్నారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు నేతలు అండగా నిలవాలని మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రజాప్రతినిధులకు ఆదేశించారు.



వైఎస్ జగన్‌ను చూసి భావోద్వేగానికి గురైన మహిళ



అభిమాన నేతతో సెల్ఫీ దిగుతూ..



చిన్నారిని లాలిస్తూ..



దాడి సంఘటనను వైఎస్ జగన్‌కు వివరిస్తున్న సతీష్‌రెడ్డి

- ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్.వి సతీష్‌కుమార్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ మాజీ చైర్మన్ అబ్బిరెడ్డిగారి మల్లికార్జునరెడ్డి , కడప నగర మేయర్, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ అధ్యక్షుడు కె. సురేష్‌బాబు, కడప నగర డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.







కడప-పులివెందుల మార్గంలో వివిధ గ్రామాల వద్ద ఘన స్వాగతం పలికేందుకు వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: ఆంధ్రప్రదేశ్ కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వైఎస్ఆర్ కడప జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల రెన్యువల్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.రవీంద్రనాథ్ తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరంలో 31-03-2024 వరకు పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు తమ రెన్యువల్స్ కోసం దరఖాస్తులను ఆయా కళాశాలల్లోని ప్రిన్సిపాల్స్‌కు ఈనెల 8వ తేదీలోపు అందజేయాలని కోరారు. అర్హతలు, ఖాళీలు, పనిగంటల ఆధారంగా కాంట్రాక్ట్ అధ్యాపకులకు 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి రెన్యువల్ చేయబడుతుందని తెలిపారు. దరఖాస్తులను స్వీకరించిన కళాశాలల ప్రిన్సిపాల్స్ సాఫ్ట్ కాపీలు, హార్డ్‌కాపీలను ఈనెల 9వతేదీలోపు ఐడీ కళాశాల (కడప ప్రభుత్వ పురుషుల కళాశాల)లో అందజేయాలని సూచించారు.

జిల్లాలో సంపూర్ణత అభియాన్

కడప సెవెన్‌రోడ్స్: ఆకాంక్ష జిల్లాల్లో భాగంగా జమ్మలమడుగు, చింతకొమ్మదిన్నె బ్లాకుల్లో ఈనెల 5, 8 తేదీల్లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని సంబంధిత శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కె.వెంకట్రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్సెల్ హాలులో ఈ అంశంపై వివిద శాఖలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీతి ఆయోగ్ గుర్తించిన ఆరు అంశాలను రానున్న మూడు నెలల కాలంలో వందశాతం సాధించాలన్నది లక్ష్యమని పేర్కొన్నారు. వైద్య, ఆరోగ్య రంగంలో గర్భిణీ స్త్రీల సమస్యలు, బాలింత తల్లుల పోషకాహార సమస్యలు, విద్యారంగంలో మౌలిక సదుపాయాలు, వ్యవసాయంలో సాయిల్ హెల్త్‌కార్డుల పంపిణీ, గ్రామీణాభివృద్ధి రంగంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు బ్యాంకు రుణాలు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఈఓ అనూరాధ, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, మెప్మా పీడీ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: రుతు పవనాల ఆగమనంతో జిల్లాలో శనివారం తెల్లవారుజామున పలు మండలాల్లో వర్షం కురిసింది. ఒంటిమిట్టలో అత్యధికంగా 8.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. సిద్దవటంలో 7.2, సీకేదిన్నెలో 6.4, బికోడూరులో 5.8, పొద్దుటూరులో 5.6 ,అట్లూరులో 4.4 , దువ్వూరులో 3.4, పెండ్లిమర్రిలో 2.4, బిమఠం, సింహాద్రిపురం ముద్దనూరులలో 2.2, పులివెందుల్లో 2, వీఎన్‌పల్లిలో 1.8, బద్వేల్‌లో 1.2, చాపాడులో 1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి

కొత్త కలెక్టర్ శివశంకర్



కడప సెవెన్‌రోడ్స్: అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని కలెక్టర్ శివశంకర్ అన్నారు. శనివారం జిల్లా 168వ కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రక ప్రాశస్త్యం ఉన్న కడపజిల్లాకు కలెక్టర్‌గా రావడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. జిల్లాను సమగ్రంగా అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. గతంలో తాము పాడేరు, సీతంపేట సబ్ కలెక్టర్‌గా, విశాఖ, కృష్ణా జిల్లాల జాయింట్ కలెక్టర్‌గా, పల్నాడు కలెక్టర్‌గా పనిచేసి ఇక్కడికి వచ్చానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుని జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు నడిపించేందుకు, రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, స్పెషల్ కలెక్టర్ కౌసర్‌భాను, ఆర్డీఓలు, పుష్పగుచ్ఛాలు అందించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఒంటిమిట్ట ఆలయ సందర్శన

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామిని శనివారం కడప జిల్లా నూతన కలెక్టర్ శివశంకర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ లాంఛనాలతో అర్చకులు స్వాగతం పలికారు. రంగమండపంలో అర్చకులు వీణ రాఘవాచార్యులు వారికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఒంటిమిట్ట ఇన్‌చార్జి తహసీల్దార్ ఆయుబ్‌ఖాన్, ఆర్ఐ రమణ పాల్గొన్నారు.



కోదండరాముని సన్నిధిలో కలెక్టర్ శివశంకర్, కుటుంబ సభ్యులు

మదనపల్లె వైద్య కళాశాలకు అనుమతి నిరాకరణ

- ఎన్‌ఎంసీ నుంచి మెయిల్
- ధ్రువీకరించిన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్
- అయోమయంలో వైద్య కళాశాల సిబ్బంది
- రాజకీయ కారణాలతోనే నిలుపుదల జరిగిందనే అనుమానాలు



జూన్ 24న ఆస్పత్రిలో పర్యటిస్తున్న నేషనల్ మెడికల్ కమిషన్ బృంద సభ్యులు (ఫైల్‌ఫొటో)

మదనపల్లె: అన్నమయ్య జిల్లాకు సంబంధించి, రాజంపేట పార్లమెంటరీ పరిధిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మదనపల్లె మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) అనుమతి నిరాకరించింది. శనివారం ఎన్‌ఎంసీ నుంచి మదనపల్లె మెడికల్ కళాశాలకు ఈ మేరకు 'డిస్ అప్రూవల్' అంటూ మెయిల్ వచ్చింది. ఈ విషయాన్ని మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ జమున ధ్రువీకరించారు. అనుమతి నిరాకరణకు సంబంధించి కారణాలు తెలియలేదన్నారు. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి, మదనపల్లె మెడికల్ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన సిద్ధం చేస్తూ వచ్చారు. ఆరోగ్యవరం సమీపంలో శాశ్వత భవన నిర్మాణ పనులతో పాటు, మెడికల్ కళాశాలకు అనుబంధంగా జిల్లా ఆస్పత్రిని బోధనాసుపత్రిగా మార్పుచేశారు. తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. రూ.11కోట్లతో జిల్లా ఆస్పత్రిలో తాత్కాలిక భవన నిర్మాణ పనులు ప్రారంభించి, 420 పడకల ఆస్పత్రి నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేశారు. మెడికల్ కళాశాలలో 24 విభాగాలకు సంబంధించి ప్రొఫెసర్లు, వైద్యులు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది నియామకాలు జరిపారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సర్వజన బోధనాసుపత్రిగా పేరుమార్చి, వైద్య విధాన పరిషత్ నుంచి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోకి తీసుకెళ్లారు. ఎన్‌ఎంసీ అనుమతులు లభిస్తే ఈ ఏడాది నుంచి తరగతి గదులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు అవసరమైన పత్రాలు సమర్పించారు. ఈ నేపథ్యంలో జూన్ 24న ఢిల్లీ నుంచి నేషనల్ మెడికల్ కమిషన్ బృంద సభ్యులు ఆరోగ్యవరంలో నిర్మాణంలోని తరగతి గదులు, హాస్టల్స్, అనాటమీ, ఫిజియోలజీ, బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లు, తదితర వాటిని పరిశీలించారు. అనంతరం జిల్లా ఆస్పత్రిలో ప్రాక్టికల్స్‌కు వీలుగా ఏర్పాటు చేసిన 420 బెడ్స్, రోగులు, వసతులను పరిశీలించి వెళ్లారు. క్షేత్రస్థాయి పరిశీలనలో తాము పరిశీలించిన అంశాలపై నివేదిక తయారుచేసి, 10 రోజుల్లో అనుమతుల విషయం తేల్చనున్నట్లు చెప్పి వెళ్లారు. శనివారం అనుమతులు నిరాకరిస్తున్నట్లు మెయిల్ పంపారు. దీంతో మదనపల్లె మెడికల్ కాలేజీకి సంబంధించి నియామకాలు పొందిన ప్రొఫెసర్లు, డాక్టర్లు, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిలో భవితవ్యంపై అయోమయం నెలకొంది.

రాజకీయ కారణాలతోనే నిలుపుదల...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తూ రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా 2023–24 విద్యాసంవత్సరంలో మచిలీపట్నం, నంద్యాల, ఏలూరు, రాజమండ్రి, విజయనగరం వైద్య కళాశాలలను ప్రారంభించింది. 2024–25 విద్యాసంవత్సరంలో పాడేరు, పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోని కళాశాలలను ప్రారంభించేందుకు నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలకు అనుగుణంగా వైద్యులు, టీచింగ్ ఫ్యాకల్టీ, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని అందుబాటులో ఉంచింది. అడ్మిషన్లు ప్రారంభించేందుకు అన్ని అర్హతలను సిద్ధం చేసి ఉంచింది. అయితే...రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటం, తర్వాత ఎన్‌ఎంసీ బృందం మెడికల్ కాలేజీ అనుమతుల పరిశీలనకు రావడం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ప్రారంభించాలనుకున్న ఐదు మెడికల్ కాలేజీలకు అనుమతి నిరాకరించడం వెనుక రాజకీయ కారణాలే ప్రధానమని పలువురు భావిస్తున్నారు. మెడికల్ కాలేజీని ప్రారంభిస్తే ఆ ఘనత వైఎస్సార్ సీపీకి వెళుతుందని, ఏడాది తర్వాత తామే తీసుకువచ్చామని, చెప్పేందుకే ఉద్దేశపూర్వకంగా అనుమతుల నిరాకరణ జరిగి ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో అరకొర వసతులకే అనుమతులిచ్చే ఎన్‌ఎంసీ... ప్రభుత్వ ఆధ్వర్యంలో దాదాపు 70 శాతం పనులు పూర్తిచేసుకుని, అన్ని వసతులు కలిగి ఉన్నప్పటికీ అనుమతులు నిరాకరించడంపై వైద్య విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. స్థానికంగా వైద్యవిద్యను అభ్యసించాలనుకుని, నీట్ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి ఆశగా ఎదురు చూస్తున్న విద్యార్థులకు నిరాశే మిగిలింది. .

పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలి




కుక్కలకు టీకా వేస్తున్న జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ

కడప అగ్రికల్చర్: ఇళ్లలో పెంచుకునే పెంపుడు జంతువులకు వాటి యజమానులు సకాలంలో టీకాలను వేయించి వాటికి వ్యాపించే వ్యాధులకు దూరంగా ఉంచాలని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ సూచించారు. శనివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప వెటర్నరీ పాలిక్లినిక్(విపిసి)లో పెంపుడు జంతువులకు ఉచిత రేబిస్ టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువుల నుంచి రేబిస్, ఆంత్రాక్స్, సార్స్, ఎబోలా, తామర, నులిపురుగులు వంటి వ్యాధులు సంక్రమిస్తామని వాటి నివారణకు తప్పకుండా టీకాలు, డీ వార్మింగ్‌ను రెగ్యులర్‌గా చేయించాలన్నారు. అనంతరం ఆమె కుక్కకు టీకా వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

175 టీకాలు..85 చికిత్సలు...

వెటర్నరీ పాలిక్లినిక్‌లో 171 రేబిస్ టీకాలతోపాటు 85 పశువులకు చికిత్స చేసినట్లు వెటర్నరీ పాలిక్లినిక్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రంగస్వామి తెలిపారు. కార్యక్రమంలో ఏడీలు డాక్టర్ నేతాజీ ఓబురాయి, డాక్టర్ సుబ్బరాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీడీఎల్ ఏడిలు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సంధ్య, డాక్టర్ సంధ్య(1962), వీఎల్‌ఓ శివలక్ష్మి, జేవీఓ రాజశేఖర్, ఎల్ఎస్ఏ షాహిదబేగం, రమేష్ పాల్గొన్నారు.

రైలులో సమస్యలకు.. యాప్‌తో చెక్



ప్రయాణికుల విషయంలో జవాబుదారీతనంగా వ్యవహరించేందుకు రైల్వే శాఖ వినూత్న కార్యక్రమాలు చేపడుతోంది. ఇప్పటికే వారి భద్రతకు సంబంధించి వివిధ రకాల సేవల నిమిత్తం టోల్ ఫ్రీ నెంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. రైలులో ప్రయాణించే వారికి ఏదైనా సమస్య తలెత్తినపుడు ఫిర్యాదు చేసేందుకు వీలుగా రైల్ మదద్ యాప్‌ను ప్రవేశపెట్టింది.

- ప్రయాణికుల కోసం రైల్వే శాఖ ప్రత్యేక యాప్
- రైల్ మదద్‌లో ఫిర్యాదు చేసేందుకు అవకాశం
- సకాలంలో స్పందించనున్న రైల్వే అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రైల్వే స్టేషన్లలో అపరిశుభ్రత, రైలులో భద్రత, సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతి ఇలా మొత్తం 35 రకాల సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైల్ మదద్‌యాప్ తీసుకు వచ్చింది. రిజర్వేషన్, జనరల్, ప్లాట్‌ఫాం టిక్కెట్లు కలిగిన ప్రయాణికులు ఈ యాప్‌లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరిస్తారు.

ఏయే అంశాలపై ఫిర్యాదు

రైల్వేస్టేషన్‌లో అపరిశుభ్ర వాతావరణం, నీటి కొరత, వెయిటింగ్ హాల్‌లో సౌకర్యాలు లేకపోవడం, రిజర్వేషన్ చేసినా వెయిటింగ్ జాబితాలో ఉండడం, టీటీఈ, ఇతర సిబ్బంది అవినీతి, రైలు సిబ్బంది నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తన, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, వస్తువుల అపహరణ, దొంగతనాలు, కొట్లాట, ధూమపానం, మద్యం తాగడం, మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన, ఆకతాయిల వేధింపుల పైనా ఫిర్యాదు చేయవచ్చు. మరుగుదొడ్లు, బోగీల్లో అపరిశుభ్రత, నాణ్యతలేని ఆహారం, ప్యాంట్రీ కార్‌లో అపరిశుభ్రత, అధిక ధరలకు తినుబండారాలు అమ్మడం, ఏసీ, లైట్లు, ఫ్యాన్లు, ఛార్జింగ్ పాయింట్లు పనిచేయకపోవడం, బెడ్ రోల్స్ అపరిశుభ్రంగా ఉండడం, రైళ్ల రాకపోకల్లో ఆలస్యం తదితర సమస్యలపై ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

యాప్ డౌన్‌లోడ్ చేయాలిలా

ప్రయాణికులు ప్లే స్టోర్‌లోకి వెళ్లి రైల్ మదద్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. సూచించిన వ్యక్తిగత వివరాలు, సెల్ ఫోన్, ఈ-మెయిల్‌ను నమోదు చేయాలి. సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. యాప్ ద్వారా ప్రయాణికుడు రైలు, స్టేషన్లలో వివిధ



సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. ఆధారాల కోసం యాప్ ద్వారా ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. సంబంధిత అధికారులకు సూచన, సలహాలు ఇవ్వవచ్చు. ప్రతి ఫిర్యాదుకు ఒక రెఫరెన్స్ నెంబరు ఉంటుంది. దాంతో ఫిర్యాదు స్టేటస్‌ను తెలుసుకోవచ్చు. సమస్య పరిష్కారం కాగానే ఫిర్యాదు దారుడికి ఎస్ఎంఎస్, ఈ మెయిల్ వస్తుంది.

నిరంతర పర్యవేక్షణ

రైల్ మదద్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై రైల్వే జనరల్, డివిజనల్ మేనేజర్లు నేరుగా పర్యవేక్షిస్తారు. ఫిర్యాదుచేసే స్థాయిని బట్టి సంబంధిత విభాగానికి చెందిన ఓ ముఖ్య అధికారికి పంపి సమస్య పరిష్కరించాలని ఆదేశిస్తారు. వారు సమస్య పరిష్కరించి అందుకు సంబంధించిన వివరాలను ఫిర్యాదు దారుడి సెల్ ఫోన్‌కు సంక్షిప్త సమాచారం రూపంలో పంపాలి. ఈ యాప్ ప్రయాణికులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని రైల్వే అధికారులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

ఎర్రచందనం డంపు స్వాధీనం

ఖాజీపేట : ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం దాడుల్లో భారీగా ఎర్ర చందనం డంపును స్వాధీనం చేసుకోవడమేగాక ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు సేకరించి అక్రమ రవాణా చేసేందుకు ఖాజీపేట మండలం నాగసానిపల్లెలో నిల్వ ఉంచారు. అనుకూల సమయం చూసి సులువుగా తరలించేందుకు రోడ్డుకు దగ్గరగా పెట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. దుండగులు దాచిన 53 దుంగలను స్వాధీనం చేసుకుని తిరుపతి కార్యాలయానికి తరలించారు. ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.

విద్యార్థి అదృశ్యం



నీలపాల గణేష్ (ఫైల్)

చాపాడు : మండలంలోని గుంత చీపాడు గ్రామంలో నివాసముంటున్న విద్యార్థి నీలపాల గణేష్ కనిపించడం లేదని తల్లి దండ్రులు నాగలక్ష్మి, గంగయ్య ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఆర్‌వి.కొండారెడ్డి తెలిపారు. మైదుకూరు మాంటిస్సోరీ పాఠశాలలో పదో తరగతి చదివే గణేష్ ఈ నెల 4న పుస్తకాల సంచి తీసుకుని ఇంటి నుంచి వెళ్లి పోయాడన్నారు. ఇంటికి రాకపోవడంతో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో టిప్పర్ దగ్ధం



టిప్పర్‌కు అంటుకున్న మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బి.కోడూరు : మండలంలోని టమటంవారిపల్లె గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించడంతో గుర్రై గ్రీన్ ఫీల్డ్‌కు హైవేకు మట్టిని సరఫరా చేసే టిప్పర్ కాలిపోయింది. స్థానికుల వివరాల ప్రకారం.. మున్నెల్లి చెరువు నుంచి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు ప్రతి నిత్యం టిప్పర్లతో మట్టి తరలిస్తున్నారు. శనివారం మట్టిని తరలిస్తుండగా ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి మంటలు వ్యాపించడంతో టిప్పర్ కాలిపోయింది. డ్రైవర్ చాకచక్యంతో దిగడంతో ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

ఎస్ఐ కొట్టాడని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రొద్దుటూరు క్రైం : వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని బాలాజీనగర్-2కు చెందిన విష్ణువర్ధన్ రెడ్డి అనే వ్యక్తి విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుల వివరాల మేరకు.. ద్విచక్రవాహనం కుదువపెట్టుకున్న విషయమై శనివారం విష్ణువర్ధన్‌రెడ్డిని టూటౌన్ ఎస్ఐ రామకృష్ణను స్టేషన్‌కు పిలిపించారు. ఈ క్రమంలో ఎస్ఐ కొట్టడంతో మనస్థాపం చెందిన అతను విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు బంధువులు తెలిపారు. విష్ణువర్ధన్ రెడ్డిని వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్ఐ రామకృష్ణను వివరణ కోరగా.. బైక్ కుదువ పెట్టుకున్న విషయమై విష్ణువర్ధన్‌రెడ్డిని మందలించానేకానీ తాను కొట్టలేదని చెప్పారు.

బిల్లులు ఇవ్వకుంటే చర్యలు

రాజంపేట రూరల్ : ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వకుంటే కఠిన చర్యలు తప్పవని కర్నూలు ఏడీపీ ఎస్.సాలురెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని కనకదుర్గ, సుబ్రహ్మణ్యం ఫర్టిలైజర్స్‌తోపాటు ఆర్ఎస్ రోడ్‌లోని విత్తన దుకాణంలో రికార్డులు, స్టాక్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్స్ యజమానులు రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఎస్ఐ రామకృష్ణనాయక్, జి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని స్నేహం

రోడ్డు ప్రమాద మృతులందరూ కడప వాసులే



అఫ్రోజ్ అలీఖాన్ (ఫైల్)



సలీంఖాన్ (ఫైల్)



జితేంద్ర (ఫైల్)

కడప అర్బన్: మరణంలోనూ వారి స్నేహం వీడలేదు. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నలుగురూ కడపకు చెందిన స్నేహితులే. కుటుంబాలకు అండగా నిలవాల్సిన వారి మృతితో వారి బంధువులు, స్నేహితుల కుటుంబాల్లో విషాదఛాయలు నెలకొన్నాయి. శనివారం అంత్యక్రియలు నిర్వహించారు.

- కడప నగరం నాగరాజుపేటకు చెందిన మరబత్తుల జితేంద్ర(25) ప్రైవేట్ హాస్పిటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తుండేవాడు. ఇటీవల కాలుకు తీవ్ర గాయమవడంతో కొంతకాలంగా ఇంటి వద్దే వున్నాడు. తన స్నేహితుడు కారు కొన్నాడని శుక్రవారం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. స్నేహితులతో కలిసి కారులో ప్రయాణిస్తుండగా మృతి చెందాడు. తండ్రి వెంకటరమణ కొరియర్‌లో పనిచేస్తున్నాడు. ఇతనికి సోదరుడు వున్నాడు. జితేంద్ర మృతితో విషాద ఛాయలు అలముకున్నాయి.
- కడప నగరం అక్కాయపల్లిలోని శాస్త్రి నగర్‌లో వుంటున్న షేక్ అలీం(30) వీడియో గ్రాఫర్‌గా, వీడియో ఎడిటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్నేహితుడు కారు కొన్నాడని, రాత్రి 9:30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాతపడ్డాడు. షేక్ అలీంకు భార్య సబియా, రెండు సంవత్సరాల కుమారుడు వున్నాడు. ప్రస్తుతం సబియా ఏడు నెలల గర్భవతి. ఇంటి యజమాని దూరమవడంతో భార్య, పిల్లలు, కుటుంబసభ్యులు, బంధువులు తీవ్రంగా రోదించారు.
- కడప నగరంలోని రాజారెడ్డి వీధికి చెందిన పఠాన్ అఫ్రోజ్‌అలీఖాన్(35) మూడు నెలల కిందటే కువైట్ నుంచి వచ్చాడు. అతనికి భార్య పఠాన్ తబస్సుమ్. వీరికి ఐదేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు వున్నారు. ప్రస్తుతం ఆయన సతీమణి గర్భిణి. తన జీవనాధారం కోసం కొన్న కారులో తన స్నేహితులను తీసుకుని వెళ్లాడు. అతనితోపాటు వెళ్లిన స్నేహితులు ముగ్గురు అతనితోపాటు మృత్యు కౌగిలిలోకి వెళ్లిపోయారు. ముగ్గురి మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఆయా మృతదేహాలను తీసుకున్న బంధువులు కడపకు వారి, వారి ఇళ్లకు తీసుకుని వచ్చి తీవ్ర ఆవేదనతో అంత్యక్రియలను నిర్వహించారు.
- కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న పూజారి ఆంజనేయులు నాయక్ (28) (హెచ్‌జి నెం.2083) కడపలోని నాగరాజు పేటలో నివాసముంటున్నారు. వీరితో పాటు వెళ్లి మృత్యువాత పడ్డాడు. ఇతని స్వగ్రామం సత్యసాయి జిల్లా కదిరి. ఇతని మృతదేహాన్ని అంత్యక్రియలకోసం వారి స్వగ్రామానికి తీసుకువెళ్లారు.

14న బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ జట్టు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని కేఎస్ఎన్ బ్యాడ్మింటన్ అకాడమీలో అండర్-11, అండర్-13, జార్జ్ క్లబ్‌లో అండర్-15, అండర్-17 బాల, బాలికల సబ్ జూనియర్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింగం భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో విడివిడిగా పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. అండర్ -11 విభాగంలో పాల్గొనే బాలబాలికలు 2014 తరువాత, అండర్-13 విభాగంలో పాల్గొనేవారు 2012 తరువాత, అండర్ -15 విభాగంలో పాల్గొనేవారు 2010 తరువాత, అండర్ -17 విభాగంలో పాల్గొనే బాలబాలికలు 2008 తరువాత జన్మించి ఉండాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఎంట్రీలను ఈ నెల 12తేదీ సాయంత్రం 5 గంటల లోగా నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440223908, 7416439745 నంబరుకు సంప్రదించాలని కోరారు.

కడప జిల్లాకు అసానయ్య హత్య కేసు

నిందితుని కోసం గాలింపు

హోసూరు : ప్రైవేటు హాస్టల్ నిర్వహణపై గొడవ ఒకరి హత్యకు దారితీసినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లా గొంటువారిపల్లి గ్రామానికి చెందిన కల్లూరి అసానయ్య(26) మాజీ వాలంటీరు. గ్రామంలో ఉపాధి లేకపోవడంతో హోసూరుకు వచ్చాడు. కామరాజ్‌నగర్‌లో అద్దె గదిలో నివాసముంటూ శుక్రవారం ఉదయం దారుణ హత్యకు గురై కనిపించాడు. స్థానికులు హడ్కో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పరిశీలించి మృతదేహాన్ని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని బంధువు చిన్నబాలు తరచూ అసానయ్యను కలిసి వెళ్లేవాడని, ఇరువురూ కలిసి ప్రైవేట్‌గా హాస్టల్ నిర్వహించాలని అనుకున్నారని వారి బంధువులు పోలీసులకు తెలిపారు. చిన్నబాలు వైఖరి నచ్చని అసానయ్య ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని 1వతేదీ నుంచి సొంతంగా హాస్టల్ ప్రారంభించాడు. ఇది నచ్చని చిన్నబాలు హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పట్టణంలోని రెడ్డీస్‌కాలనీకి చెందిన ఓ యువతి(18) అనారోగ్య కారణాలతో శనివారం ఇంటి వద్దే కంఫర్ట్ ద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించింది. అదే విధంగా పుంగనూరు మండలం దున్నవారిపల్లెకు చెందిన వెంకటరమణ భార్య నాగరత్నమ్మ (37) కుటుంబ సమస్యలతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

రామాపురం/రాయచోటి టౌన్: ఉమ్మడి జిల్లాలో ప్రమాదాల నివారణా చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్లూరు సమీపంలో కారు, ట్యాంకర్ ఢీకొన్న ప్రమాద స్థలాన్ని ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి శనివారం పరిశీలించారు. ప్రమాదానికి కారణాలను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వాహనదారులు అతి వేగంతో ప్రయాణం చేస్తూ ప్రాణాలకు హాని తెచ్చుకోవద్దని సూచించారు. ప్రమాదాలకు కారణమైన ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు, కల్వర్టులు, రేడియం స్టిక్కర్లు, సూచిక బోర్డులు ఏర్పాటుచేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. కడప-రాయచోటి ఘాట్ రోడ్డులో సొరంగం తవ్వి నాలుగు వరుసల రహదారి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో, త్వరలోనే టన్నెల్ పనులు ప్రారంభిస్తామన్నారు. దీంతో ప్రమాదాల నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. అనంతరం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలను పరిశీలించి నివాళి అర్పించారు. తన సొంత నిధులు రూ.25,000ల చొప్పున నలుగురి కుటుంబాలకు లక్ష రూపాయలు అందజేశారు.

ఏపీ మోడల్ స్కూల్‌కు బస్సులు నడపాలి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు నడపాలని కోరుతూ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి శనివారం వినతిపత్రం సమర్పించారు. మంత్రి స్పందించి రాయచోటి డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌కు బస్సు సర్వీసు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగయ్య, ఉపాధ్యాయులు నిత్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్యాంకులతో సుస్థిర ఆర్థికాభివృద్ధి

సీఈఓ రాజామణి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ బ్యాంకు సీఈఓ రాజామణి

కడప అగ్రికల్చర్ : జిల్లా సహకార కేంద్ర బ్యాంకులతో సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించేలా చూడాలని డీసీసీ బ్యాంకు సీఈవో రాజామణి పేర్కొన్నారు. అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి బాటలో నడిపించాలని ఆమె సూచించారు. కడప డీసీసీ బ్యాంకులో శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం నిర్వహించారు. ముందుగా బ్యాంకు ఆవరణలో సహకార శిక్షణా కళాశాల ప్రిన్సిపల్‌తో కలిసి సీఈఓ రాజామణి జెండా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బ్యాంకు లక్ష్యాలను చేరుకోవడానికి అందరు సమష్టిగా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. పొద్దుటూరు సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సహకారం సంఘాలు అందరికీ మంచి భవిష్యత్తు అందిస్తాయని, సిబ్బంది నీతి, నిజాయతీతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం సభ్యులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు, సహకార శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

32 ఎర్రచందనం దుంగలు పట్టివేత



రోళ్లమడుగు అటవీ ప్రాంతంలో కూంబింగ్ పార్టీకి లభ్యమైన ఎర్రచందనం దుంగలు

రాజంపేట : అన్నమయ్య జిల్లా అటవీ అధికారి వివేక్ ఆదేశాల మేరకు రాజంపేట రేంజ్ పరిధిలోని రోళ్లమడుగు, తుమ్మలబైలు బీట్ ప్రదేశాలలో 32 ఎర్రచందనం దుంగలను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. రేంజర్ నారాయణ మాట్లాడుతూ ఈ నెల 5న సాయంత్రం కూంబింగ్ నిర్వహిస్తుండగా రోళ్లమడుగు బీట్ ప్రదేశంలోని మొలకలచెట్ల కోన ప్రదేశంలో తనిఖీలు చేశామన్నారు. కొంతమంది గుర్తుతెలియని స్మగ్లర్లు కూంబింగ్ పార్టీని చూసి పారిపోయారన్నారు. ఆ ప్రదేశంలో తనిఖీలు చేయగా 970 కిలోల బరువు, రూ.2,75,000 విలువ కలిగిన దుంగలు ఉండడంతో స్వాధీనం చేసుకుని అటవీ శాఖ కార్యాలయానికి తరలించామన్నారు. ఈ కూంబింగ్‌లో అటవీ అధికారులు రవిశంకర్, కిరణ్‌కుమార్, సుబ్బరాయుడు, ఉపేంద్ర, ప్రసాద్‌నాయక్, జగన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెండు నెలల బాలుడు మృతి



మృతి చెందిన బాలుడు

కమలాపురం : మండలంలోని వసంతపురం గ్రామానికి చెందిన రెండు నెలల బాలుడు శనివారం ఉన్న పాటుగా మృతిచెందాడు. ఏఎన్ఎం రమణమ్మ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యగా గ్రామంలోని చిన్నారులకు శనివారం వ్యాధి నిరోధిక టీకా(వ్యాక్సిన్) వేసింది. అందులో భాగంగా రెండు నెలల బాలుడికి టీకా వేయించిన తల్లి అనంతరం పడుకోబెట్టింది. ఎంతసేపటికీ బాలుడు లేవకపోవడంతో కుటుంబ సభ్యులు గమనించి వెంటనే పెద్దచెప్పలి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జ్ఞాన ప్రసూన వివరణ కోరగా గ్రామంలో చాలామంది చిన్నారులకు టీకా వేశానని, అయితే ఈ బాలుడికే మాత్రమే అలా ఎందుకు జరిగిందో అర్థం కావడంలేదని సమాధానమిచ్చారు.

కణితి మాంసం స్వాధీనం



నిందితులతో అటవీ అధికారులు

వేంపల్లి : చక్రాయపేట మండలం కొండవాండ్లపల్లి అటవీ ప్రాంతంలో విద్యుత్తు తీగలు అమర్చి అడవి జంతువులను చంపుతున్నారని వేంపల్లి అటవీ రేంజర్ అధికారి బాల సుబ్రహ్మణ్యం తెలిపారు. చిలేకాంపల్లె బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో సిబ్బందితో కలిసి తనిఖీలు చేయగా కొండవాండ్లపల్లె గ్రామానికి చెందిన రాజు, పట్టం సుబ్బరాయుడు, చినరాజు, గురు కణితి మాంసంతో కనిపించారన్నారు. మాంసాన్ని స్వాధీనం చేసుకుని, వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం వారిపై కేసు నమోదు చేశామన్నారు. అటవీ సమీపంలోని గ్రామంలో ఏవైనా ఉచ్చు, విద్యుత్తు తీగలు వేసి అడవి జంతువులను వేటాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ నలుగురిని లక్కిరెడ్డిపల్లె మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు మధు, మనోహర్ బాబు, సుమలత స్ట్రైకింగ్ ఫోర్ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్టుల తయారీలో అన్నమయ్య జిల్లాకు అగ్రస్థానం

జిల్లా పాస్‌పోర్ట్ ఆఫీసర్‌కు ప్రశంసా పత్రం



విజయవాడ రీజనల్ పాస్‌పోర్టు అధికారి శివహర్ష నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న సత్యనారాయణ

రాయచోటి : పాస్ పోర్టులు అందించడంలో అన్నమయ్య జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. గత ఏడాది ఏప్రిల్ 1, 2023 నుంచి నేటి వరకు 65,512 పాస్‌పోర్టులు విచారించి దరఖాస్తుదారులకు అందజేశారు. రాష్ట్రంలోనే అన్నమయ్య జిల్లా ప్రథమ స్థానంలో నిలవడంతో జిల్లా పాస్‌పోర్ట్ అధికారి సత్యనారాయణకు శనివారం విజయవాడ రీజియన్ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ద్వితీయ స్థానంలో ఎన్టీఆర్ జిల్లా నిలిచింది. వీరి సేవలను గుర్తించి ప్రభుత్వం ప్రశంసా పత్రం అందజేసింది.

దరఖాస్తులను సకాలంలో ఇచ్చాం

పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరణలో సిబ్బంది సహకారం ఎంతో ఉంది. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం విచారణ పూర్తి చేసి 65,512 పాస్ పోర్టులను దరఖాస్తు చేసుకున్న వారికి సకాలంలో అందించగలిగాం. రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది.

– సత్యనారాయణ, ఎస్బీఐ జిల్లా ఇన్‌ఛార్జి, అన్నమయ్య జిల్లా

క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం

వివిధ దేశాలకు వెళ్లే నిమిత్తం పాస్ పోర్టులు కోరితే.. వివరాలు అన్నమయ్య జిల్లా పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధి, విద్య, పారిశ్రామిక అవసరాల నిమిత్తం విదేశాలకు వెళ్లే ప్రతి ఒక్కరికీ పాస్‌పోర్టు అవసరం. రాష్ట్రంలోనే ఎక్కువ పాస్‌పోర్టులను అందించి ప్రథమ స్థానంలో నిలవడంలో సిబ్బంది సహకారం బాగా ఉంది.

– బి కృష్ణారావు, జిల్లా ఎస్పీ, అన్నమయ్య జిల్లా

సమగ్ర శిక్ష సిబ్బందికి వేతనాలు నిల్

రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల మంది నిరీక్షణ

పెద్దతిప్పసముద్రం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సమగ్ర శిక్ష ఉద్యోగులకు నిరాశే మిగులుతోంది. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలందక పోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 వేల మంది పనిచేస్తున్నారు. వారికి రెండు నెలల జీతాలతోపాటు గత ఏడాది డిసెంబరు నెలకు సంబంధించి 21 రోజుల బకాయిలు ఇప్పటి వరకూ చెల్లించలేదు. ప్రభుత్వ పాఠశాలలు, భవిత కేంద్రాలు, మోడల్, కస్తూర్బా పాఠశాలలతోపాటు హాస్టళ్ల నిర్వహణ, సమదుస్తులు, పాఠ్య, నోటు పుస్తకాలు, బ్యాగ్‌లు, బాలికలకు న్యాప్ కిన్స్‌తోపాటు ఏ పథకం అమలు కావాలన్నా సమగ్ర శిక్ష ఉద్యోగులే కీలకం. ఈ పథకం నిర్వహణకు ఏటా కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం బడ్జెట్ కేటాయిస్తాయి. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన సీఆర్పీలు, కస్తూర్బాలో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, మోడల్ స్కూళ్లు, హాస్టళ్లలోని వార్డన్లు, వంట సహాయకులు, వాచ్‌మెన్లు, భవిత కేంద్రంలోని ఐఈఆర్టీలు, ఎంఆర్‌సీలోని డేటాఎంట్రీ ఆపరేటర్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్, మెసెంజర్లు తమ వంతు విధులు నిర్వహిస్తున్నారు. అంతేగాక జిల్లా కేంద్రాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సైట్ ఇంజినీర్లు, తాత్కాలిక ఇన్‌స్ట్రక్టర్లు, సిస్టం అనలిస్టులు కూడా ఉన్నారు. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో దిగాలు పడుతున్నారు. చిరుద్యోగుల అవసరాలు దృష్టిలో ఉంచుకుని పెండింగ్ జీతాలు, బకాయిలు మంజూరు చేయాలని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

మదనపల్లె : సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మండలంలోని వేంపల్లె పంచాయతీ నడిమి తండాలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. సారా విక్రయిస్తున్న కృష్ణా నాయక్ భార్య లక్ష్మమ్మ(53)ను అదుపులోకి తీసుకుని, ఆమె వద్ద పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.